

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా..

ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును సవాల్ చేస్తూ సుప్రీంలో వైఎస్సార్ సీపీ పిటీషన్ దాఖలు చేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. -8లో



దొరికేశాయ్.. మీ ఫోన్ ఉందేమో చూసుకోండి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భారీగా మొబైల్ ఫోన్‌లు రికవరీ చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
40.0/25.7

వాతావరణం

జిల్లాలో మంగళవారం 25.7 - 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వేసవి శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 2025–26 సంవత్సరంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి గల శిక్షకులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు సీనియర్ క్రీడాకారుల నుంచి ప్రతిపాదలను తీసుకుంటున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథ రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ ప్రతిపాదనలను ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందచేయాలని సూచించారు.

పీహెచ్‌ఎంఈయూ జోన్ అధ్యక్షుడిగా రామ సుబ్బారెడ్డి



కడప రూరల్: పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా పీజే రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. తన నియామకం సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్ రావు, ప్రధాన కార్యదర్శి అహరోన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి డి కే సాగర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

21న ధర్నా



మాట్లాడుతున్న కె.నాగభూషణం, తదితరులు

పులివెందుల టౌన్: మాదిగల వర్గీకరణ సాధన కోసం ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో డప్పు చర్మకారుల సంఘ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ సాధన కోసం మాదిగ సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, బాల నరసింహులు, బలపనూరు భార్గవ, భీమన్న పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థిని ప్రతిభ



పీజీ వైద్య విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోత్స్న, వైద్యులు, సిబ్బంది

కడప అర్బన్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడాంటిక్స్ (ఐఏసీడీఈ) ఏటా దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్షల్లో కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఎండోడాంటిక్స్ విభాగ పీజీ విద్యార్థిని డాక్టర్ స్నేహ జంగటి విశేష ప్రతిభ కనబరిచారు. కాంపిటీటివ్ పేపర్ విభాగంలో (కేస్ రిపోర్ట్) ద్వితీయ బహుమతి సాధించారు. వీరిని ఆ విభాగపు అధ్యాపకులు డాక్టర్ పి. సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ సుందర్, డాక్టర్ దుర్గాభవాని, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ తేజశ్రీ రాథోడ్, డాక్టర్ తిరుపతి నాయుడు సరైన మార్గదర్శకాలు అందించి పోటీకి సిద్ధం చేశారు. పీజీ విద్యార్థిని డాక్టర్ స్నేహను ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న అభినందించారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ , ఎంపీఈడీ, ఎంసీఏ)నాలుగో సెమిస్టర్, ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పరీక్షలు మంగళవారం విశ్వవిద్యాలయ ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య పి పద్మ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కె. ఎస్ వి కృష్ణారావు తో కలసి తనిఖీ చేశారు. నిర్వహణలో ఇబ్బందుల గురించి ఆరా తీశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో 543 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల నిర్వహణ బాధ్యతల్లో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమారి, సిబ్బంది చంద్రమౌళి పాల్గొన్నారు.



ఫారెస్ట్ ఫర్ సేల్

బండ బారిన అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా మార్చుకున్నారో.. నోట్ల కట్టలు ఎరగా వేసి తమకు అనుకూలంగా మలచుకున్నారో గానీ.. కొండనే చదును చేస్తున్నారు. 'సోలార్ ' ముసుగులో హల్‌చల్ చేస్తున్నారు. 'ఇది వన్యప్రాణులుండే కొండ ప్రాంతం.. మా పశువులకు మేత దొరికే అటవీప్రాంతం' అంటూ స్థానికులు ప్రశ్నిస్తే కొన్నామంటున్నారు. మరి అమ్మిందెవరో.. అనుమతులిచ్చిన దొరలెవరో..

- అనుమతులు లేకుండానే 500 ఎకరాల పశుమేత భూమి చదును
- కన్నెత్తిచూడని రెవెన్యూ అధికారులు
- అనుమతులతోనే పనులు చేస్తున్నామంటున్న 'సోలార్ ప్రతినిధులు'
- అనుమతులు ఇవ్వలేదంటున్న రెవెన్యూ అధికారులు



224 సర్వేనంబర్‌లోని కొండను చదును చేస్తున్న యంత్రాలు



కొండ ప్రాంతంలో ఉన్న నెమళ్లు

జమ్మలమడుగు/మైలవరం: పెద్దముడియం మండలం కర్నూల్ జిల్లా సరిహద్దు గ్రామాలైన పాపాయపల్లె, కల్వటాలలో 'సోలార్ కంపెనీ'ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. అనుమతులు లేకున్నా కొండ భూములను ఎంచక్కా చదును చేసుకుంటూ వెళ్తోంది. అడిగేవాడు లేకపోవడంతో ప్రభుత్వం భూములకు దిక్కేలేకుండాపోయింది. వివరాల్లోకి వెళితే.. కొండపాపాయపల్లె గ్రామానికి చెందిన 224 సర్వేనంబర్‌లో 501 ఎకరాల కొండ భూమి ఉంది. స్థానికంగా ఉన్న రైతులకు సంబంధించిన గొర్రెలు, పశువుల మేతకోసం వదిలిన కొండ ప్రాంతమిది. అంతేకాకుండా పశువులు నీరు తాగే కుంటలు కూడా ఉన్నాయి. పైగా ఈ భూమిలో వన్యప్రాణుల సంచారం ఎక్కువగా ఉంది. నెమళ్లు, అడవి కుక్కలు రకరకాల జాతుల పక్షులతోపాటు జింకల సంచారం కూడ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం సేల్ అనే ప్రైవేట్ సోలార్ కంపెనీ ఈ ప్రాంతాన్ని పూర్తిగా చదును చేసే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే చాలా వరకు కొండ భూభాగాన్ని చదును చేశారు. సదరు కంపెనీకి చెందిన ప్రతినిధులు పెద్దపెద్ద పొక్లెయిన్లు డోజర్లు పెట్టి కొండ ప్రాంతాన్ని పూర్తిగా చదును చేయడంతోపాటు చెట్లను, కొండలను యథేచ్ఛగా తొలగిస్తున్నారు. అడ్డుచెబితే ఎక్కడ పోలీసుల కేసు పెడతారో అన్న స్థానికులు భయపడుతున్నారు. కొందరు ధైర్యంగా ఇదేమని ప్రశ్నిస్తే తమకు అనుమతులు ఉన్నాయని.. ఈ కొండను పూర్తిగా సోలార్‌కు వాడుకుంటున్నామని చెబుతున్నట్లు సమాచారం. ఇక రెవెన్యూ అధికారులు ప్రశ్నించే దాఖలాలే లేకపోవడంతో కంపెనీప్రతినిధుల దుశ్చర్యకు అడ్డే లేకుండా పోతోంది.

- సెల్ కంపెనీ ప్రతినిధులు ప్రభుత్వ భూముల్లో పనులు చేపడుతున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందినా అటువైపు వెళ్లి ఆ పనులు పరిశీలించిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొందరు గట్టిగా నిలదీస్తే రికార్డు వెతుకుతున్నామంటూ దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

కొండ కల్వటాలలో .. దిగవ కొండ కల్వటాలలో సర్వేనంబర్ 320ను సబ్ డివిజన్ చేసి గత ప్రభుత్వంలో 32 మంది రైతులకు 42 నుంచి 50 ఎకరాల భూమిని ఇచ్చారు. అసైన్డ్ కమిటీ ద్వారా పట్టాలను పొందిన రైతుల భూముల్లో సైతం కంపెనీ వారు పనులు ప్రారంభించడం గమనార్హం. లబ్ధిదారులు ఫిర్యాదులు చేయడంలో ప్రస్తుతం ఆ పనులను నిలిపివేశారని స్థానికులు తెలిపారు.

కొండను చదును చేస్తున్నారు



సోలార్ కంపెనీ ప్రతినిధులు కొండ భూమిని చదును చేస్తున్నారు. ఈ అడవి ప్రాంతం అనేక వన్యప్రాణులకు ఆవాసంగా ఉంది.పంచాయతీ అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారు.

-ఎం.తిమ్మారెడ్డి, కొండపాపాయపల్లి

పశువులకు మేత కోసం వదిలిన భూమి



పశువులకు మేత కోసం ఈ కొండ ప్రాంతంలోనికి వెళ్తాం. ప్రస్తుతం ఆ భూమిని మొత్తం చదును చేస్తున్నారు. ఎందుకు చదును చేస్తున్నారంటే అధికారులు ఈ భూమి ఇచ్చారంటున్నారు.

-వెంకటేశ్వరరెడ్డి, కొండపాపాయపల్లి

అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం



మా గ్రామంలో పశు సంపద ఎక్కువగా ఉంది. పైగా కొండప్రాంతంలో జింకలతో పాటు, నెమళ్లు ఉన్నాయి. ఇప్పుడేమో వారు చదును చేసేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేశాం.

-సంజీవరాయుడు, కొండపాపాయపల్లి

అనుమతులతోనే పనులు చేస్తున్నాం

సోలార్ ప్రాజెక్టు పనులు అన్ని అనుమతులతోనే చేస్తున్నాం. 224 సర్వేనంబర్‌లో 500 ఎకరాల భూమిని ప్రభుత్వం సోలార్‌కు ఇచ్చింది. దీనికి సంబంధించిన జీవో కలెక్టర్ వద్ద ఉంది.

-నరేన్ చౌదరి, సోలార్ కంపెనీ ప్రతినిధి

రికార్డులను పరిశీలిస్తున్నాం

సోలార్ కంపెనీకి ఇచ్చిన భూములు ఎన్ని ఉన్నాయో రికార్డులను పరిశీలిస్తున్నాం. సర్వేనంబర్224లో 501 ఎకరాల భూమి ఉంది. అందులో 147 ఎకరాలు సబ్‌డివిజన్ చేసి అసైన్డ్ కమిటీ ద్వారా రైతులకు పట్టాలిచ్చాం. మిగిలిన భూమిని సోలార్ కోసం ప్రతిపాదనలు పంపించాం.-నరసింహులు, తహసీల్దార్ పెద్దముడియం

నేడు బీఎస్‌ఎన్‌ఎల్ ప్రత్యేక శిబిరాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ సర్వీసు శిబిరాలు నిర్వహించనున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం షేక్ ముజీబ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2025 నెలను కస్టమర్ సర్వీస్ నెలగా పాటించడం కోసం కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటిలో బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాల వద్ద బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కస్టమర్ సర్వీస్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో మొబైల్ సిమ్ సేవలు, ఫైబర్ ఇంటర్నెట్, ఇతర బీఎస్‌ఎన్‌ఎల్ సేవలకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. వినియోగదారులు తమ సేవల సమస్యల పరిష్కారానికి .. కొత్త సేవలు కోసం తప్పకుండా ఈ శిబిరాన్ని సందర్శించాలని సూచించారు.

జిల్లా వాసులకు నాటకరంగ పురస్కారాలు



మూల మల్లికార్జునరెడ్డి



ఆర్. సుబ్రమణ్యం



సుభాష్ చంద్రబోష్

కడప కల్చరల్: రంగస్థలంలో చిరకాలంగా విశేష సేవలందిస్తున్న కళాకారులకు కందుకూరి వీరేశలింగం పంతులు స్మారకంగా ఇచ్చే తెలుగు నాటకరంగ దినోత్సవం పురస్కారాలకు జిల్లాకు చెందిన ముగ్గురు కళాకారులు ఎంపికయ్యారు. వీరిలో వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, ప్రొద్దుటూరు కళాభారతి నాటకసంస్థ సభ్యులు ఆర్. సుబ్రమణ్యం, కె.సుభాష్‌చంద్రబోష్ ఉన్నారు. కాగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరగనున్న పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో వీరు అతిథుల చేతుల మీదుగా పురస్కారాలను అందుకోనున్నారు.

జననేతకు పాలాభిషేకం



మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ముస్లింలు

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా శ్రేయస్సును కాంక్షించేవాడే నిజమైన నాయకుడవుతాడు..అధర్మాన్ని.. అన్యాయాన్ని ఎదిరించినవాడు.. సత్యం వైపు నిలబడేవాడే జననాయకుడిగా మిగిలిపోతారు.. వైఎస్సార్ సీపీ అధినేత.. మాజీ సీఎం వైఎస్ జగన్ అదే చేస్తున్నా రు. అధికార గర్వంతో... తామేంచేసినా చెల్లుతుంది..చట్టమవుతుందన్న అహంకారంతో కూటమి నేతలందరూ కూడబలుక్కుని తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. తాజాగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేసి అండగా నిలిచారు. దీంతో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ చిత్రపటానికి సింహాద్రిపురం ముస్లింలు పాలా భిషేకం చేశారు. ముస్లింలపట్ల కూటమి నేతలు, ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నా రని ధ్వజమెత్తారు. - సింహాద్రిపురం

రామయ్యకు పుష్పయాగం



సీతారామలక్ష్మణ మూర్తులకు పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

ఏకశిలానగరి కోదండ రామయ్య సన్నిధిలో మంగళవారం సాయంత్రం పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన నయనమనోహరమైన పుష్పాలతో దాశరథిని అర్చించారు. బెంగళూరు, నాగర్‌కోయిల్, శ్రీరంగం, చెన్నై, తిరుపతి, కడప నగరాల నుంచి 2.5 టన్నుల 14 రకాల పూలు, 6 రకాల పత్రాలు తెప్పించారు. గులాబి, చామంతి, నూరువరహాలు, సంపంగి, మల్లె, గన్నేరు, మొగలిరేకులు, కనకాంబరాలు, తామర పూలు తీసుకువచ్చారు. తులసిదళాలు, దవనం, పన్నీరు, మరవం పత్రాలతో సీతారామలక్ష్మణ మూర్తులకు పుష్పనీరాజనం చేశారు. -ఒంటిమిట్ట

నేలకొరిగిన అరటి



లింగాలలో కూకటి వేళ్లతో నేలకూలిన అర్టెళ్ల పిలకలు



సింహాద్రిపురం: నేల కూలిన అరటి పంట వద్ద రైతు రమాకాంత్‌రెడ్డి

వడగండ్ల వాన రైతన్నలకు కడగండ్లు మిగిల్చాయి. చేతికొచ్చిన పంటను నేల వాల్చి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. జిల్లాలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు.. వడగండ్ల వానకు పలుప్రాంతాల్లో వందల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పులివెందుల ప్రాంతంలో తీవ్రంగా పంట నష్టం జరిగింది.

- దెబ్బతీసిన వడగండ్ల వాన, ఈదురు గాలులు
- వందల హెక్టార్లలో కూలిన అరటి పంట
- కోట్ల రూపాయల పంట నష్టం

లింగాల: మండలంలో ఈదురు గాలులు, వడగండ్ల వానకు అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సోమవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బలమైన ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వడగండ్ల వాన కురవడంతో అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గెలలతో కూడిన అరటి పంటే కాక, ఆరు నెలల మొక్కలు సైతం కూకటి వేళ్లతో కూలిపడ్డాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని లింగాల, పెద్దకుడాల, చిన్నకుడాల, లోపట్నూతల, గుణకణపల్లె, రామట్లపల్లె, చిన్నకుడాల గ్రామాల్లో సుమారు 240హెక్టార్లలోఅరటి పంట ధ్వంసమైందని, సుమారు రూ.6కోట్ల మేర నష్టం వాటిల్లింటుందని ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని ఆయన అన్నారు. గెలలతో కూడిన అరటి పంట దెబ్బతినడంతో పెట్టుబడులు కూడా దక్కలేదని రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సింహాద్రిపురం: రెండు రోజులలో చేతికందాల్సిన పంట గాలివాన బీభత్సానికి చేలోనే నెలకొరిగింది., అకాల వర్షానికి కళ్లెదుటే నేలపాలైందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. మండలంలోని సుంకేసులలో రెండు రోజుల్లో పంట కోత కోయడానికి వస్తున్న సమయంలో తాను వేసిన నాలుగు ఎకరాలలో అరటిపంట నేలపాలైందని అరటి రైతు రమాకాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అలాగే దిద్దేకుంట్ల, తదితర గ్రామాలలో కూడా పలువురు రైతుల అరటి చెట్లు నేలకొరిగి నష్టం వాటిల్లింది. అధికారులు పొలాలను పరిశీలించి పభుత్వానికి నివేదికలు పంపాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మైలవరం జలాశయానికి నీటి విడుదల నిలిపివేత

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి కృష్ణా జలాలు బంద్ చేసినట్లు గాలేరు నగరి–సృజల స్రవంతి ఈఈ ఉమ మహేశ్వర్లు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ వేసవిలో సాగు, తాగునీటి అవసరాల కోసం గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి రెండు టీఎంసీలు పంపామన్నారు. మంగళవారం జలాలు నిలిపివేశామన్నారు. గండికోట జలాశయంలో పూర్తి సామర్థ్యం 26.85టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.3 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. ఎత్తిపోతల ద్వారా 300 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో అనారోగ్యంతో ఈ నెల 8న గుర్తుతెలియని వృద్ధురాలు(65) చికిత్స నిమిత్తం వార్డులో చేరారు. ఈ నెల 14న పరిస్థితి విషమించి మృతిచెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని మార్చురీలో వుంచారు.

నేడు నిర్వాసితులకు స్పెషల్ గ్రీవెన్స్

కొండాపురం : గండికోట ముంపు గ్రామం పెంజి అనంతపురం నిర్వాసితులకు నేడు జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల తహశీల్దారు గుర్రప్ప తెలిపారు. ముంపువాసులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

జిల్లాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని 111 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, ఒక బొలెరో క్యాంపర్ వాహనం స్వాధీనం చేసుకున్నారు.

దొరికేశాయ్..
మీ ఫోన్ ఉందేమో చూసుకోండి

- జిల్లాలో ఆపరేషన్ మొబైల్ షీల్డ్
- రూ.1.8 కోట్ల విలువైన 602 మొబైల్స్ స్వాధీనం
- బాధితులకు అప్పగించడంలో ప్రత్యేక చొరవ
- విలేకరులతో ఎస్పీ అశోక్‌కుమార్ వెల్లడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లు



బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్

కడప అర్బన్ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ నిఘా, డేటా విశ్లేషణా పద్ధతుల ద్వారా భారీగా మొబైల్ ఫోన్‌లు రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ పేర్కొన్నారు. కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను తీసుకుని ×ఆపరేషన్ మొబైల్ షీల్డ్₹ క్రింద కడప సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేశారన్నారు. మొత్తం 602 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని, వాటి విలువ సుమారు రూ.1.8 కోట్లు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకూ ఆరు విడతలుగా మొత్తం రూ.9.2 కోట్ల విలువైన 4670 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు ఆయన వెల్లడించారు. తమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ బృందం అధునాతన డిజిటల్ ఫోరెన్సిక్స్, జీపీఎస్ ట్రాకింగ్, ఐఎంఈఐ ట్రేసింగ్, సైబర్ నిఘా టూల్స్ రికవరీ చేసేందుకు వినియోగించి ఈ ఘనత సాధించిందని ఆయన తెలిపారు. ఎంఎంటీఎస్(మిస్సింగ్ మొబైల్ ట్రేసింగ్ సిస్టమ్), వాట్సాప్ చాట్‌బాట్ నెంబర్ 9392941541, సీఈఐఆర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో వారు మంచి ఫలితాలు సాధించారన్నారు.

ఆశ పడవద్దు.. ఫోన్ పోగొట్టుకోవద్దు

సైబర్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసు సూచనలను తప్పకుండా పాటించాలని ఎస్పీ తెలిపారు. ఆశపడి ఎవరూ మెసేజ్‌లు, ఈ మెయిల్స్, కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరం జరిగితే పోలీసులను సంప్రదించాలన్నారు. మొబైల్ పోయినప్పుడు ఈ కింది జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని ఆయన సూచించారు.

- బ్యాంకు ఖాతాలను తక్షణమే బ్లాక్ చేయించాలి.
- సిమ్ కార్డ్ నెంబర్‌ను ఆలస్యం చేయకుండా డిజబుల్ చేయించుకోవాలి.
- గూగుల్‌పే, ఫోన్‌పే వంటి ఆర్థిక యాప్‌లు/అప్లికేషన్‌లను2–ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ లేదా బయోమెట్రిక్ సెక్యూరిటీ వినియోగించాలి.
- మొబైల్ పోయిన తక్షణమే గూగుల్/ఆపిల్ ఐడీ, బ్యాంకింగ్ యాప్స్, వాట్సాప్, మెయిల్, సోషల్ మీడియా వంటి వాటి పాస్‌వర్డ్స్ మార్చండి.
- ఎంఎటీఎస్ లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలి.
- ఆండ్రాయిడ్ ఫోన్ల నుంచి ఫైండ్ మై డివైస్, ఐఫోన్‌ల నుంచి ఫైండ్ మై ఐ ఫోన్ (ఐ క్లౌడ్) ద్వారా ట్రాక్ చేయడం, రింగ్ చేయడం, లాక్ చేయడం, లేదా డేటా డిలీట్ చేయడం చేయొచ్చు. మీ మొబైల్ పోయిన వెంటనే: వాట్సాప్ 9392941541 కు కాల్ చేసి వివరాలు తెలుపవచ్చు.
- గూగుల్‌లో 'సీఈఐఆర్ పోర్టల్' సెర్చ్ చేసి ఫోన్ పోయిందని ఫిర్యాదు నమోదు చేయవచ్చు. 1930కు కాల్ చేసి తెలపవచ్చు. హెచ్‌టీటీపీఎస్://సైబర్‌క్రైమ్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు.
- సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనాలనుకుంటే ఫోన్ బిల్లు, సెల్‌ఫోన్ బాక్స్, ఫోన్ అమ్మే వ్యక్తి గురించి పరిశీలించుకోవాలి.
- అపరిచితుల నుంచి ఫోన్లు కొనుగోలు చేయడం ద్వారా సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉంది.

సైబర్ క్రైం బృందం ప్రతిభ

కడప సైబర్ క్రైమ్ టీం ఆధ్వర్యంలో, మొబైల్ ఫోన్ల రికవరీకి సంబంధించిన డిజిటల్ ఫోరెన్సిక్స్ ఆధారిత సాంకేతికత ఉపయోగించడంతోనే మొబైల్ ఫోన్‌లు రికవరీ చేయగలిగారని ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ సైబర్ క్రైమ్ బృందాన్ని అభినందించారు. ఈ రికవరీ ఆపరేషన్‌లో ప్రధానంగా పనిచేసిన ఇన్స్పెక్టర్ ఎ.మధు, మల్లేశ్వరరెడ్డి, సిబ్బంది కానిస్టేబుళ్లు శ్యాంప్రసాద్‌రావు, పి.నరహరి, కె.శ్రీనివాసులు, అమర్నాథ్ రెడ్డిలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రికవరీ అయిన సెల్‌ఫోన్లను బాధితులకు జిల్లా ఎస్పీ తమ చేతులమీదుగా అందజేశారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా
సుప్రీంలో వైఎస్సార్‌సీపీ పిటీషన్

- పార్లమెంటులో ద్వంద్వ వైఖరి అంటూ వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం
- రెండు నాల్కల ధోరణి ఎవరిదో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసు
- దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మంత్రి ఫరూఖ్ వ్యాఖ్యలున్నాయి
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : భారతరత్న డా.బీఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు–2025ను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో వైఎస్సార్‌సీపీ పిటీషన్ దాఖలు చేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా అన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లు విషయంలో రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా ముస్లిం, మైనార్టీ సంస్థలు, సెక్యులర్ సంస్థలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయని, వైఎస్సార్‌సీపీ కూడా న్యాయ పోరాటం సాగించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. దేశంలో లక్షల ఎకరాల్లో ఉన్న వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకునేందుకు ఈ దురాగతానికి ఒడిగట్టారన్నారు. ముస్లింలకు ఈ బిల్లు మేలు చేస్తుందని మంత్రి ఫరూఖ్ మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మండిపడ్డారు. పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏనాడూ ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి గూర్చి ఆలోచన చేయలేదన్నారు. బిల్లు విషయంలో వైఎస్ఆర్‌సీపీ లోక్‌సభలో ఒకలా, రాజ్యసభలో ఒకలా వ్యవహరించిందని మంత్రి ఫరూఖ్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. రెండు నాల్కల ధోరణి ఏ పార్టీదో, ఏ నాయకుడిదో రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలుసన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ఈ బడ్జెట్‌తో పథకాల అమలు చేయలేమని చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. పార్లమెంటులో తమ ఎంపీలతో వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చారని, తాము నాలుగు సవరణలు చెప్పామని, వాటికి కేంద్రం ఆమోదం తెలిపిందని మంత్రి తెలపడం శుద్ధ అబద్ధమన్నారు. వక్ఫ్ బై యూజర్‌ను తొలగించలేదని, ఆ భూమిని దేనికి ఉపయోగిస్తున్నారో తెలిపే డాక్యుమెంట్లను ఆరు నెలల తర్వాతైనా సమర్పించాల్సిందేనని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని, పీసీసీ అధ్యక్షురాలు అధికార పార్టీ తప్పులను ఎత్తి చూపకుండా వైఎస్సార్‌సీపీనే విమర్శిస్తూ ఉంటారన్నారు. టీడీపీ ఇబ్బందుల్లో ఉన్న ప్రతిసారీ షర్మిల బైటికొచ్చి మాట్లాడతారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్ఎండీ షఫీ, అజ్మతుల్లా, జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్.ఇలియాస్, డిష్ జిలాన్, పవర్ అల్తాఫ్, జఫ్రుల్లా, జమీల్, రిజ్వాన్, రాయల్ బాబు, అక్బర్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'భారతి'



తాపీ మేస్త్రీలకు టోపీలు, టీ షర్టులు అందజేస్తున్న భారతి సిమెంట్ కంపెనీ అధికారులు

ప్రొద్దుటూరు : మండు వేసవిలో కష్టపడుతున్న భవన నిర్మాణ కార్మికులపై భారతి సిమెంట్ యాజమాన్యం మానవత్వం చూపింది. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో పలు చోట్ల పనిచేస్తున్న తాపీ మేస్త్రీలకు వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు శీతల పానీయాలు, రక్షణ కోసం టీషర్ట్‌లు, టోపీలు మంగళవారం అందించింది. ఈ సందర్భంగా భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ కె.నాగేంద్ర తాపీ మేస్త్రీలతో మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీతో భారతి సిమెంట్‌ను తయారు చేస్తున్నారని, శ్లాబ్‌ల నిర్మాణానికి తమ సిమెంట్ అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ టెక్నికల్ ఇంజినీరింగ్ ఛాయాపతి, చిన్న శ్రీకాంత్‌రెడ్డి, భవాని శంకర్, ఉదయ కిరణ్, సాయిప్రకాష్‌తోపాటు తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఈత సరదా.. ప్రాణం తీసింది



తేజశ్విని(ఫైల్).

అట్లూరు : సోదరుడితో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన బాలిక తేజశ్విని(14) నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు.. బంధువుల వివరాల మేరకు.. అట్లూరు మండలం కమలకూరు గ్రామానికి చెందిన చిట్టిబోయిన సిద్దయ్య(శివప్రసాద్), సుబ్రమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారి ద్వితీయ కుమార్తె తేజశ్విని తొమ్మిదో తరగతి చదువుతోంది. కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం పొలాలకు వెళ్లింది. పొలం సమీపంలో ఉన్న కమలకూరు ఆనకట్ట వద్ద నీరు పుష్కలంగా ఉండడంతో సరదాగా ఈత కొట్టాలని అనుకుంది. తమ్ముడు నానితో కలిసి ఆనకట్ట వద్దకు వెళ్లి ప్లాస్టిక్ డబ్బాల సాయంతో నీటిలోకి దిగింది. ప్రమాదవశాత్తూ డబ్బా ఊడిపోయి అక్క నీట మునగడం చూసిన తమ్ముడు నాని కుటుంబీకుల వద్దకు వెళ్లి చెప్పారు. వారు హుటాహుటిని వచ్చి చూసేలోగా తేజశ్విని మృతిచెందిందని ఆమె బంధువులు తెలిపారు. అంతకుముందు అందరితో కలిసి సామూహికంగా బోజనం చేసి ఈతకు వెళ్లిన కుమార్తె ఇంతలోనే మృతిచెందడంతో తల్లి తండ్రులు రోదన స్థానికులను కలచివేసింది. గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

కడపలో నడిరోడ్డుపై
వ్యక్తి దారుణ హత్య

- పాత కక్షలతోనే కత్తితో గొంతుకోసి దారుణంగా చంపారు
- సంఘటన స్థలంలో పరిశీలించిన కడప తాలూకా పోలీసులు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు



హత్యకు గురైన సాదిక్‌వలీ (ఫైల్)

కడప అర్బన్ : పాత కక్షలతో ఒక వ్యక్తిని కత్తితో పొడిచి.. గొంతు కోసి దారుణంగా హతమార్చిన సంఘటన మంగళవారం సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. కడప నగరం రవీంద్రనగర్ మరాఠీవీధికి చెందిన సాదిక్ వలి(30)ని బిల్టప్ వద్ద నడిరోడ్డుపై మంగళవారం దారుణంగా హత్య చేశారు. కడపలోని మరాఠీ వీధిలో నివాసముంటున్న సాదిక్‌వలికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పాత బస్టాండులో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతంలో ఇతడు బిల్టప్ సమీపంలోని పుత్తా ఎస్టేట్స్ సమీపంలో వెంకటేశ్వర్లు అనే యువకుడిని దారుణంగా మద్యం సీసాతో గొంతు కోసి చంపిన కేసులో నిందితుడిగా వున్నారు. ఆ హత్యకేసులో అరెస్టయిన ప్రస్తుత మృతుడు సాదిక్‌వలి బెయిల్‌పై ఇటీవల విడుదలై వచ్చాడు. హత్య జరిగిన ప్రదేశాన్ని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పరిశీలించారు. హత్యకు పాల్పడిన వారు నలుగురు లేదా ఐదుగురు వుండవచ్చని భావిస్తున్నారు. నిందితులు పరారీలో వున్నారు. మృత దేహం వద్ద బంధువులు, స్నేహితులు బోరున విలపించారు. నిందితులకు సంబంధించిన పుటేజీని పోలీసులు సేకరించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి విత్తన విక్రయ దుకాణాల తనిఖీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో పత్తి విత్తన విక్రయ దుకాణాలను గుంటూరు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయ అధికారుల బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించింది. కార్యాలయ అయిల్ సీడ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బక్కా ప్రభాకర్, అగ్రికల్చర్ ఆఫీసర్ శివశంకర్, స్థానిక టెక్నికల్ ఆఫీసర్ గోవర్ధన్ విత్తన దుకణాలను తనిఖీ చేసి లైసెన్సులు, రికార్డులు పరిశీలించారు. వివిధ కంపెనీల పత్తి విత్తనం నాణ్యతను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి





గాయపడిన యువకులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం, ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన ద్విచక్రవాహనం

మరొకరి పరిస్థితి విషమం

చింతకొమ్మదిన్నె/కడప వైఎస్ఆర్ సర్కిల్: చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని కడప – చిత్తూరు జాతీయ రహదారిపై బుగ్గలేటిపల్లె గ్రామం వద్ద మంగళవారం అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మండలంలోని మూలవంక గ్రామానికి చెందిన ఓర్సు జగదీష్ (20) అనే యువకుడు మృతి చెందగా మౌలా అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సీకే దిన్నె పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మూలవంక గ్రామానికి చెందిన జగదీష్, మౌలా అనే ఇరువురు కడప నుంచి రాయచోటి రహదారి వైపు వెళుతుండగా బుగ్గలేటిపల్లె గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ జగదీష్ మృతి చెందాడు. మౌలా పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు జగదీష్ బెంగులూరులో చదువుతుండగా.. మౌలా కొప్పర్తిలోని డిక్సన్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం కోసం సీకే దిన్నె పోలీసులు గాలిస్తున్నారు.

గుట్టలు కరుగుతున్నాయ్



చిన్నరంగాపురం పిల్లి గుట్టలో మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం



తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : టీడీపీ నాయకుల భూదాహానికి గుట్టలన్నీ కరిగిపోతున్నాయి. యథేచ్ఛగా ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వి అమ్ముకుంటూ తమ జేబులు నింపుకొంటున్నారు. దీంతో పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం సమీపంలో ఉన్న పిల్లిగుట్ట రోజు రోజుకూ కరిగిపోతోంది. ఈ మట్టి మఫియాకు కూటమి నేతల అండ దండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. దీంతో జేసీబీలు పెట్టి యథేచ్ఛగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.2 వేల వరకు విక్రయిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. పులివెందుల మున్సిపాలిటీలో ఈ దందా ఇటీవల పెరిగిపోయింది. ఈ విషయమై తహసీల్దారు నజీర్ అహమ్మద్ వివరణ కోరగా మట్టి తరలించడం చట్టరీత్యా నేరం.. మట్టి తవ్వకాలు జరిపే వారిపై చర్యలు చేపడతామన్నారు.

అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి

చిన్నరంగాపురం పరిధిలోని పిల్లిగుట్టలో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తూ కూటమి నాయకులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని, అక్రమ తవ్వకదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పులివెందుల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వి.రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, బాలక్కగారి వెన్నపూసప్రతాప్‌రెడ్డి, రాజుల వివేకానంద రెడ్డి, రాజుల సుధీర్‌రెడ్డి, వెన్నపూస రామకేశవరెడ్డి, పెద్ద రంగాపురం వైఎస్ఆర్సీపీ నాయకులు తహసీల్దారు నజీర్ అహ్మద్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పిల్లిగుట్ట నుంచి అధికారుల అనుమతులు లేకుండా లక్షల రూపాయల విలువైన మట్టి రవాణా జరుగుతోందన్నారు. ధనార్జనే ధ్యేయంగా సామాన్యుల నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తూ సామాన్యులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ట్రాక్టర్‌కు సామాన్యుల చెంత రూ.2 వేల నుంచి రూ.3వేల వరకు డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాకుల ఆగడాలకు అధికారులు అడ్డుకట్ట వేయకపోతే వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామన్నారు.